
సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 13 । జూన్ । 2023



ఎన్నాళ్లీ మోత?

నూతన పంచాయతీలు ఏర్పడి నాలుగేళ్లు దాటినా చాలావరకు కనీస వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. 8లో▸



రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

రైతాంగ ఆర్థిక ప్రగతే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కార్ పనిచేస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



ఎన్నికలు నిర్వహించాల్సిందే

నాట్కో పరిశ్రమలో కార్మిక సంఘం ఎన్నికలన నిర్వహించాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో కార్ డ్రైవింగ్, సీసీటీవీ కెమెరా రిపేరింగ్‌లో ఈ నెల 15నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి పాసైన యువకులు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

హుడాకాంప్లెక్స్: సీఐఈఎల్, జీహెచ్ఎంసీ సర్కిల్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ సేల్స్‌మెన్ ఉద్యోగాల భర్తీకి మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్ హరికృష్ణయ్య తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్కిల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఆపై విద్యార్హత కలిగి ఉండాలని, 19 నుంచి 30 ఏళ్ల లోపు వారు మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఇతర వివరాలకు 80085 35309, 80085 35312 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పల్లె ప్రగతి ఏర్పాట్ల పరిశీలన



స్థానిక అధికారులతో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్

కొత్తూరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15న నిర్వహించనున్న పల్లె ప్రగతి ఏర్పాట్లను జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ పరిశీలించారు. సోమవారం ఆయన ఎంపీడీవో శరత్‌చంద్రబాబుతో కలిసి మండలంలోని పెంజర్ల పంచాయతీని సందర్శించారు. అనంతరం ఈ నెల 15న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

షాద్‌నగర్: ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించినట్లు షాద్‌నగర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.దరఖాస్తుల స్వీకరణను ఈనెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు.ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 26287 నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

18, 25న ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలోని యూనికార్న్స్ వర్త్ అండ్ డీడ్ హాస్పిటల్ గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోత్స్న తెలిపారు. ఈ శిబిరంలో కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించడానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18, 25వ తేదీల్లో ఉచితంగా బ్లడ్‌షుగర్, బీపీ, నోటి పరీక్షలు, పాప్ స్మెర్, మామోగ్రామ్, ఛాతి ఎక్స్‌రే, క్లినికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తామన్నారు. వ్యాధి నివారణ కంటే నిరోధించడం ఉత్తమం అన్నారు. గర్భాశయ కేన్సర్, రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్‌లను ముందుగా గుర్తించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో వెల్‌కం బ్యాక్ టు స్కూల్ అంటూ స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



ఇబ్రహీంపట్నం రూరల్: పూలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



ఉత్సాహంగా బడిబాట పట్టిన విద్యార్థులు

వేసవి సెలవులు ముగిశాయి.. బడిగంట మోగింది.. పాఠశాలలు సోమవారం తిరిగి తెరుచుకున్నాయి. ఇన్ని రోజులు ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు వాటికి టాటా చెప్పి బడిబాట పట్టారు. ఆయా పాఠశాలలను శుభ్రం చేసి మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉపాధ్యాయులు పూలతో విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థులు సెలవుల్లో గడిపిన రోజులను తోటి మిత్రులతో పంచుకున్నారు. మొదటిరోజు కావడంతో హాజరు శాతం అంతంతమాత్రంగానే కనిపించింది.

మొక్కకు దిక్కేది?

పంచాయతీల్లో నిధుల్లేక సతమతం

- ప్రతి శుక్రవారం నీళ్లు పోయాలన్న నిబంధన గాలికి
- నిర్వహణ కరువై ఎండిపోతున్న వైనం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

గ్రామ పంచాయతీలకు నిధులు ఇలా

జిల్లాలో మొత్తం పంచాయతీలు	: 558
పంచాయతీలకు సమకూర్చిన ట్రాక్టర్లు	: 558
ఇప్పటి వరకు నాటిన మొక్కలు	: 20.60 లక్షలు
2022-23 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు	
రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి అందిన నిధులు	: రూ.46,72,29,295
15వ ఆర్థిక సంఘం నుంచి అందిన నిధులు	: 38,41,06,618



ఇబ్రహీంపట్నంలో రోడ్డు పక్కన ఎండిపోతున్న మొక్కలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏటా సగటున 75 లక్షల మొక్కలు నాటుతోంది. ఇందుకు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేపడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆశించిన స్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. ఏడేళ్లుగా నాటిన మొక్కలకు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న మొక్కల లెక్కలకు పొంతన లేకుండా పోయింది. హరితహారంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటడం, ఫొటోలకు ఫోజులివ్వడం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం తప్ప నాటిన మొక్కలు ఎలా ఉన్నాయి? వాటికి నీరు పోస్తున్నారా? రక్షణ కల్పించారా? వంటి అంశాలను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచే కాదు 15వ ఆర్థిక సంఘం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, ఆయా పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, ట్రాక్టర్లకు నెలవారీ కిస్తీలు చెల్లించేందుకు, డీజిల్‌కు డబ్బులు లేకపోవడంతో రోడ్ల వెంట నాటిన మొక్కలకే కాదు పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు సైతం నీరు పోయలేని పరిస్థితి. ఫలితంగా నాటిన మొక్కల్లో చాలా వరకు కనిపించకుండా పోయినట్లు జిల్లా యంత్రాంగం ఇటీవల చేపట్టిన మొక్కల గణనలో స్పష్టమైంది.

విరిగిపోయి..వాడిపోయిన వైనం

ఈ ఏడాది 74.100 లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్దేశించుకుని, ఇప్పటి వరకు 89.24 లక్షల మొక్కలు నాటారు. 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 23.50 లక్షల మొక్కలు, పంచాయతీల పరిధిలో 43.60 లక్షల మొక్కలు, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ మేరకు నాటలేకపోయారు. రోడ్డకిరువైపులా నాటిన మొక్కల సంరక్షణ కోసం అవసరమైన కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాల రాకపోకలతో విరిగిపోయాయి. నాటిన తర్వాత వాటికి నీళ్లు కూడా పోయకపోవడంతో చాలా వరకు ఎండిపోయాయి. ప్రస్తుతం పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల్లో మినహా ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలు కూడా నీరు లేక వాడిపోయి కనిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో నాటిన మొక్కలు సైతం చాలా వరకు ఎండిపోయాయి.

నాటినవి నాటినట్టే..

జిల్లాలో 83 ఫారెస్ట్ బ్లాకులు ఉన్నాయి. వీటిలో 69 బ్లాక్స్ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. వీటిలో 26 అర్బన్, 22 కన్జర్వేషన్ బ్లాకుల పరిధిలో ఉన్నాయి. 2017–18లో 65 కిలోమీటర్ల మేర, 2018–19లో 46 కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారుల వెంట పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ప్రస్తుతం ఇక్కడ నాటిన మొక్కల్లో చాలా వరకు కనిపించడం లేదు.

సంవత్సరం	నాటిన మొక్కలు
2015-16	73.78 లక్షలు
2016-17	139.24 లక్షలు
2017-18	71.041 లక్షలు
2018-19	86.12 లక్షలు
2019-20	105.429 లక్షలు
2020-21	102.745 లక్షలు
2021-22	89.248 లక్షలు
2022-23	81.418 లక్షలు

కరువైన రక్షణ

హరితహారంలో భాగంగా జిల్లాలో భారీగా మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలపై నుంచి వాహనాలు వెళ్లడం, పశువులు తొక్కడంతో వీటిలో చాలా వరకు విరిగిపోయాయి. ఉన్న వాటికి కూడా నీరు పోయడం లేదు. దీంతో ఎండకు వాడిపోతున్నాయి. పంచాయతీలకు ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకపోవడంతో మొక్కల సంరక్షణ బాధ్యతను గాలికొదిలేశాయి.

సమాజంలో పోలీసుల పాత్ర గొప్పది

- మంత్రి సబితారెడ్డి
- ఉత్సాహంగా తెలంగాణ 5కే రన్

మీర్‌పేట: సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో గొప్పదని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బడంగ్‌పేట నుంచి మీర్‌పేట మంత్రాల చెరువు వరకు నిర్వహించిన 'తెలంగాణ 5కే రన్'ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యువత, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులతో కలిసి మంత్రి రన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శాంతిభద్రతల పర్యవేక్షణలో దేశంలోనే తెలంగాణ పోలీసు మొదటి స్థానంలో నిలిచారని, వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు శాఖకు అత్యాధునిక వాహనాలు, సౌకర్యాలు కల్పించారని గుర్తుచేశారు. మన షీటీమ్‌లు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేషన్ల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ ఏడాది ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన బడిబాటకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా పాఠశాలలో చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 20న విద్యా దినోత్సవం రోజున విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందజేస్తామన్నారు. ఈ ఏడాది 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, ఎంఈఓ కృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: స్థానిక మున్సిపల్ క్రీడా మైదానం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు నిర్వహించిన 5కే రన్‌ను విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర చాలా గొప్పదన్నారు. యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ, మీర్‌పేట్ పోలీసులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో రాష్ట్రం

పహాడీషరీఫ్: తెలంగాణ సిద్ధించాక రాష్ట్రం ప్రగతి పథంలో కొనసాగుతోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం ఏసీపీ అంజయ్య ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్ వై జంక్షన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ హరీశ్, జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డితో కలిసి 2కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసింగ్‌లో అనేక మార్పులు తీసుకొచ్చి కమాండ్ కంట్రోల్ నిర్మించి శాంతి భద్రతలో పర్యవేక్షణలో ముందున్నామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ 5కే రన్‌లో భాగంగా గాలిలోకి బెలూన్లు వదులుతున్న మంత్రి సబితారెడ్డి తదితరులు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్ తదితరులు

ఈవీఎంలకు పటిష్ట భద్రత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల నిర్వహణ కోసం ఉపయోగించే ఈవీఎం వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్స్‌ను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఈవీఎం, వీవీ ప్యాట్ల భద్రత కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తు న్న వేళ ఈవీఎంల పనితీరును పరిశీలించి,లోపాలను సరిదిద్దనున్నట్లు చెప్పారు.జూలై 1 వరకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి వాటి పనితీరును పరిశీలించనున్నట్లు ప్రకటించారు.బ్యాటరీలను మార్చి వాటిని సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈవీఎంలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్ట్‌లో పేలిన సిలిండర్లు

మంటల్లో దగ్ధమైన హోటల్

గచ్చిబౌలి: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని ఫుడ్ కోర్ట్‌లోని గ్యాస్ సిలిండర్లు పేలి అగ్ని ప్రమాదం జరిగింది. హోటల్ సిబ్బంది అప్రమత్తం కావడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. మాదాపూర్ సీఐ తిరుపతి, అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్‌కు చెందిన సత్యనారాయణ నవ్యశ్రీ ఫుడ్‌కోర్ట్‌లో టిఫిన్ సెంటర్, కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.35 గంటలకు షార్ట్ సర్క్యూట్ కారణంగా కూరగాయల దుకాణంలోకి మొదట మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమై ఫుడ్ కోర్ట్‌లోని నాలుగు సిలిండర్లు బయటికి తీశారు. ఆలోపే మంటలు అంటుకోవడంతో రెండు సిలిండర్లను అక్కడే వదిలేశారు. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో రెండు సిలిండర్లు పేలిపోయాయి. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఆందోళనకు గురై పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అప్రమత్తమై మంటలను ఆర్పారు. ఫుడ్ కోర్టు, కూరగాయల దుకాణం కాలిపోవడంతో దాదాపు 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలి

షాబాద్: సమాజంలో అస్పృశ్యత నివారణకు మహాత్మా బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో హోప్ ఫౌండేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌తో కలిసి సోమవారం బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. చేవెళ్ల, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అంజయ్య యాదవ్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే కులమతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం బసవేశ్వరుడి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ ఎంపీపీ జ్యోతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు

ఎన్నాళ్లీ మోత?

- నూతన పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటులో అలసత్వం
- రేషన్ సరుకుల కోసం పక్క ఊరికి వెళ్లాల్సిన పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, మహిళలు


మహదేవ్‌పూర్ నుంచి రేషన్ బియ్యం మోసుకెళ్తున్న పులుసుమామిడివాసులు

కొందుర్గు: రాష్ట్రంలో నూతన పంచాయతీలు ఏర్పాటుచేసి నాలుగేళ్లు దాటినా చాలావరకు పంచాయతీల్లో కనీస వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, చౌకధరల దుకాణం వంటివి లేకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్లక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రగతి అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. మెజార్టీ పంచాయతీలకు ఇంతవరకు నూతన భవనాలు నిర్మించలేదు.

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు..

రంగారెడ్డి జిల్లాలోని 24 మండలాలకు సంబంధించి 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు, 586 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందుకు గాను 919 చౌకధర దుకాణాలు ఉండగా కొన్ని దుకాణాలు వివిధ కారణాలతో నడవడం లేదు. ఇక ప్రస్తుతం 570 దుకాణాల ద్వారా ప్రతినెల 56,0245 రేషన్ కార్డుదారులకు 11,771.92 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. అయితే నూతన గ్రామపంచాయతీల్లో చౌకధరల దుకాణాలు ఏర్పాటుచేయకపోవడం వల్ల లబ్ధిదారులు పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. వెంటనే నూతన రేషన్ దుకాణాలను మంజూర్ చేసి దూరభారం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణం మంజూరు చేయాలి



గ్రామంలో చౌకధర దుకాణం ఏర్పాటుచేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చి మూడేళ్లు కావస్తుంది. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఇక కొత్త గ్రామపంచాయతీ మంజూరైంది తప్ప ఇప్పటికీ సొంత భవనం లేదు. అధికారులు స్పందించి రేషన్ దుకాణం ఏర్పాటుచేయాలి.

– షరీఫా బేగం, సర్పంచ్, పులుసుమామిడి

కొత్తూరులో విషాద ఛాయలు

- గృహప్రవేశానికి వచ్చి తిరిగి వెళ్తున్న బంధువుల కారుకి ప్రమాదం
- ఏడుగురి దుర్మరణం
- మృతులంతా ఏపీ తూ.గో జిల్లావాసులు

కొత్తూరు: అప్పటిదాక నూతన గృహ ప్రారంభ వేడుకలో పాల్గొని బంధుమిత్రులతో భోజనాలు చేసి సంతోషంగా గడిపారు... వేడుక అనంతరం తిరుగు ప్రయాణంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వివరాలు.. కొత్తూరు పట్టణంలో ఉంటున్న రిలయన్స్ ట్రైలర్ నిర్వాహకుడు అరుణ్‌కుమార్ ఇటీవల నూతన గృహాన్ని నిర్మించాడు. ఇందులో భాగంగా ఈ నెల11న ఆదివారం నిర్వహించిన గృహ ప్రవేశానికి తూర్పు గోదావరి జిల్లా అత్రేయపురం మండలం వెల్చేర్ గ్రామానికి చెందిన ఆయన బంధువులు హాజరైయ్యారు. అనంతరం అదే రాత్రి వారు కొత్తూరు నుంచి తమ స్వగ్రామానికి కారులో బయలుదేరగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఈ ఘటనతో కొత్తూరులోని బంధువులు ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారిని స్థానిక నాయకులు పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యం


ఆలకుంట శ్రీను

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గోవిందస్వామి కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బావండ్లపల్లికి చెందిన ఆలకుంట శ్రీను (40) బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం నగరంలోని గుర్రంగూడ టీచర్స్‌కాలనీకి వచ్చి దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 7న శ్రీను ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- పీఏసీఎస్ గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ


యాచారం: గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

యాచారం: రైతాంగ ఆర్థిక ప్రగతే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కార్ పనిచేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో రూ.58 లక్షల నిధులతో పీఏసీఎస్ గోదాం నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇబ్రహీంపట్నం నియోజవర్గంలో రూ.5 కోట్ల నిధులతో పీఏసీఎస్‌ల వద్ద గోదాంల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లో ఖాతాదారులుగా ఉన్న రైతుల పిల్లల విదేశీ ఉన్నత చదువుల కోసం ఆర్థిక రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గృహ నిర్మాణాలకు కూడా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, డైరెక్టర్లు మల్లేష్, శంకర్‌నాయక్, యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, ఎంపీడీఓ విజయలక్ష్మీ, తహసీల్దార్ సుచరిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో పీఏసీఎస్ భవనం..

నందిగామ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా మేకగూడలో పీఏసీఎస్ భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్, మేకగూడ పీఏసీఎస్ చైర్మన్ మంజులారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేకగూడలో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీఎస్ భవనాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. డీసీసీబీ బ్యాంకు నుంచి రూ.76 లక్షలను రుణంగా తీసుకొని ఆధునిక హంగులతో పీఏసీఎస్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్న భవనంలో స్టాఫ్‌రూం, కిచన్, చైర్మన్ గది, సమావేశం హాల్, అదనపు గదులు, అద్దెకు ఇవ్వడానికి మూడు షెటర్లు నిర్మించినట్లు చెప్పారు. దీంతో పాటు గోదాంలను సైతం నిర్మిస్తున్నట్లు చెప్పారు.

తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్


మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

మంచాల: ప్రతి ఒక్కరూ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్ ద్వారా మంచాల మండల చీదేడ్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనతో పాటు శిథిలావ్యవస్థలో ఉన్న తరగతి గదుల పునఃనిర్మాణం, పెయింటింగ్ వేసే పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీ నారాయణను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందన్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందన్నారు. మద్యం నిషేధిత గ్రామాలను దత్తత తీసుకొని తమ ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికి మూడు గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సౌకార్యర్థం బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. తమవంతు సహకారం పాఠశాలల అభివృద్ధికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ తిరుమలేష్, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న పాండురంగం కుటుంబీకులు

షాద్‌నగర్: కొత్తూరు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి పాండురంగం సోమవారం రూ.5లక్షల 11వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి సతీషన్‌నాయర్‌కు పాండురంగం కుటుంబ సభ్యులు విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్ఆర్ మోటార్స్ యజమాని రహమత్ రూ.51వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలబట్ల శివకుమార్, పలబట్ల సతీష్‌కుమార్, పలబట్ల ఆనంద్‌కుమార్, మాజీ చైర్మెన్ అగ్గనూరు విశ్వం, కౌన్సిలర్, వెంకట్‌రాంరెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తేవాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


ధర్నాలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఏడాదే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని సౌకర్యాలతో వాడుకలోకి తీసుకురావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ నాయకులు సున్నపు వసంతం డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం ఎదుట సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ 2013లో చేవెళ్లకు డిగ్రీ కళాశాలను మంజూరు చేసిందని.. దీనికి బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేసి ఏడేళ్లు దాటినా కూడా ఒక డిగ్రీ కళాశాల భవనాన్ని పూర్తిచేయించలేకపోయారని విమర్శించారు. ఇప్పటికైనా డిగ్రీ కళాశాల భవాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకునిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీసీసీ నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు డి.సమత, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, మైనార్టీ అధ్యక్షుడు వాజిద్, యూత్ అధ్యక్షుడు శ్రీను, ఎంపీటీసీ మైసయ్య, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, రాజుగైడ్, మహేశ్వర్‌రెడ్డి, రాములు, నాయకులు ఉన్నారు.

'ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయండి'

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన విధంగా బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని కాశీరావ్ డిమాండ్ చేశారు. సమావేశంలో మండల టీపీయుఎస్ అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లిన బాలుడి మృతి


శివ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: చేపల వేటకు వెళ్లిన ఓ బాలుడు అదే చెరువులో మునిగి మృత్యువాత పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామం జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి చెందిన దండుగుల వెంకటయ్య కుమారుడు దండుగుల శివ(13) సోమవారం ఉదయం కాలనీకి చెందిన మరో ఇద్దరు మిత్రులతో కలిసి స్థానిక చింతల్ చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో శివ చెరువు లోపలికి వెళ్లగా లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో అతని మిత్రులు స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. ముకునూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్(27) తన స్నేహితుడితో కలిసి సోమవారం బైక్‌పై దండుమైలారం గ్రామం వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రశాంత్ అప్పటికే మృతిచెందా డు. అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- దంపతులకు తీవ్ర గాయాలు
- తుమ్మలూరు గేటు సమీపంలో ప్రమాదం

మహేశ్వరం: బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరు గేటు సమీపంలోని సోమవారం చోటు చేసుకుంది. సీఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండం వెన్నచెర్ల గ్రామానికి చెందిన ముద్దని రాముడు, భార్య శివలీల ఇద్దరూ మండల పరిధిలోని రావిర్యాల గ్రామంలో అద్దెకు నివాసం ఉంటూ మేస్త్రి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు రావిర్యాల నుంచి తుమ్మలూరు గేటు సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడివైపు వీరు బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రికి తరలించారు. వారి బంధువులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ తంగరాళ్ల లింగయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

రూ.9.5 లక్షల సొత్తు స్వాధీనం


కృష్ణారెడ్డి


ప్రభు


తిరుమల

మీర్‌పేట: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9.5 లక్షల సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి సోమవారం మీర్‌పేట పీఎస్‌లో వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ రసూల్‌పురాకి చెందిన చిల్లకూరి కృష్ణారెడ్డి (38) సెంట్రింగ్ పని చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన గొడుగు ప్రభు (28) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఇద్దరూ కలిసి ఈనెల 6వ తేదీన గుర్రంగూడ ఎస్‌బీఆర్ కాలనీకి చెందిన కోటనాని సుజాత కుమారుడు ఫణివర్ధన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి బీరువాలోని తొమ్మిదిన్నర తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లారు. మరో సంఘటనలో బడంగ్‌పేట సుబ్రమణ్య కాలనీకి చెందిన రాపాక రమేష్ ఈ నెల 5వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అదే ప్రాంతానికి చెందిన కార్మికుడిగా పనిచేసే రాయకోటి తిరుమల (21) ఇంటి తాళాలు పగులగొట్టి 7 తులాల బంగారు ఆభరణాలు, కొంత వెండి ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఏ–1 చిల్లకూరి కృష్ణారెడ్డి, ఏ–2 గొడుగు ప్రభును అరెస్ట్ చేసి 9 తులాల బంగారం, నాలుగు తులాల వెండి ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరూ పాత నేరస్తులని, కృష్ణారెడ్డిపై పలు పోలీస్ స్టేషన్లలో 12 కేసులు, ప్రభుపై రెండు కేసులు నమోదై ఉన్నాయన్నారు. మరో నిందితుడు తిరుమల వద్ద నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మీర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ జీ.ఈరోజి, కే.శేఖర్, సిబ్బంది ఏ.శివరాజ్, పి.ఎల్లయ్య, వై.విజయ్‌కుమార్ రెడ్డి, నగేష్, నవీన్‌కుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- కర్కల్‌పహాడ్ శివారులోని ఫాంహౌస్‌లో ఘటన
- తండ్రిపైనే అనుమానం ఉందంటూ కుమారుడి ఫిర్యాదు


స్వరూప మృతదేహం

కడ్తాల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ శివారులోని ఎస్ఎస్ ఫాంహౌస్‌లో సోమవారం ఉదయం వెలుగు చూసింది. ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన వల్లభదాసు స్వరూప(40), శ్రీనివాస్ దంపతులు.. ఇద్దరూ స్థానిక ఫాంహౌస్‌లో కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌కు వివాహం జరిగినప్పటి నుంచి మద్యానికి బానిసై తరుచూ భార్యను వేధించేవాడు. ఈ విషయమై గతంలో వారి గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టినా.. భర్త శ్రీనివాస్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఇదిలా ఉండగా ఈనెల 11న స్వరూపతో.. శ్రీనివాస్ గొడవపడి ఎక్కడికో వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఫాంహౌస్‌లో స్వరూప అనుమానదస్పందగా మృతి చెంది ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ మృతదేహన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్ తన అమ్మ మరణం విషయంలో నాన్న శ్రీనివాస్‌పై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాల్సిందే

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- నాట్కోఫార్మా వద్ద మజ్దూర్ యూనియన్ జెండా ఆవిష్కరణ


మజ్దూర్ యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నందిగామ: ప్రముఖ ఫార్మా కంపెనీ నాట్కో పరిశ్రమలో కార్మిక సంఘం ఎన్నికలను తప్పకుండా నిర్వహించాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మేకగూడ శివారులోని నాట్కో ఫార్మా కెమికల్ డివిజన్ పరిశ్రమ వద్ద మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూనియన్ జెండాను ఎమ్మెల్యే రఘునందన్ రావు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘం అధ్యక్షులు కార్మికుల హక్కుల కోసం పోరాడాలని.. అయితే నాట్కో పరిశ్రమ కార్మిక సంఘాల అధ్యక్షుడు పరిశ్రమ యాజమాన్యం బాగుకోసం పనిచేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంఘాలు కార్మికుల హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, వర్కింగ్ ప్రసిడెంట్ వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శ్రీను, నర్సింహా, సంయుక్త కార్యదర్శులు పాండు, విష్ణు, యాదిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాంసింగ్, బాబు,రాందాస్, కోశాధికారి శేఖర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..

పలు పార్టీలకు చెందిన పలువురు నాయకులు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు వారికి పార్టీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.